ధాన్యం నాణ్యతపై రాంబాబు తప్పుడు ప్రచారం మానుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు డిమాండ్

విశాలాంధ్ర - బెలగాం : రైతులను తప్పుబడుతూ ధాన్యం నాణ్యత లోపం వల్లనే కొనుగోలు ధరలు తగ్గుతున్నాయని రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంబాబు అలియాస్ రవి చేసిన తప్పుడు ప్రచార ఆరోపణలను ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో రైస్ మిల్లుల్లో జరిగిన దోపిడీలను అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు చేపట్టిన చర్యల మూలంగా రైతులను తప్పుబడుతూ ధాన్యం కొనుగోలుపై జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు రాంబాబు చేసిన తప్పుడు ప్రచారం చేయడం సరైనది కాదని, ఇది చాలా దుర్మార్గమని బంటు దాసు మండిపడ్డారు. నాణ్యత లోపం మిల్లర్లలో మాత్రమే ఉన్నదని రైతు పండించే పంటల్లో లేదని తేల్చి చెప్పారు. గతం కంటే భూమి సారవంతం పెరగడం వలన పంట దిగుబడి నాణ్యత పెరిగిందని, అకాల వర్షాలు, తుఫాన్ల కారణంగా పంట నష్టం వాటిలకుండా ముందస్తు జాగ్రత్తలు పడుతూ దానిని కూడా యధావిధిగా మిల్లర్లకు తరలించకుండా పంట పొలాలలో రోడ్లమీద ఆరబెట్టి మరీ మిల్లర్ల కేంద్రాలకు అందించే పని రైతులు చేస్తున్నారని, అటువంటి రైతులపై తప్పుడు నిందలు మోపడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి రైతు సంఘం పార్వతీపురం డివిజన్ పర్యటనలో భాగంగా రైతుల సమస్యలను గుర్తించే క్రమంలో రైతులు మిల్లర్లకు అందించే ధాన్యంలో అనేక షరతులను జోడించి ప్రభుత్వం ప్రకటించే ధర కంటే చాలా తక్కువ ధరకు కొనుగోలు చేపట్టి రైతులను మోసం చేస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించే 100 కేజీల బస్తా ధాన్యం 2,369 రూ.లకు, నాణ్యత లోపం చూపించి 8 నుండి 12 కేజీల ధాన్యాన్ని యాజమాన్యం అదనంగా తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా ధాన్యం లోనే నాణ్యతలోపం ఉందని మిల్లర్ల అసోసియేషన్ భావిస్తున్నట్లయితే రైతులతో పాటు ఎపి రైతు సంఘం బహిరంగ చర్చకు సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. నేటికీ అధికారికంగా జిల్లాలో పంట నష్టం వాటిల్లినట్టు ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదని, ఇది కేవలం రైతుల నుండి అదనపు ధాన్యాన్ని కూడగట్టుకునే ప్రయత్నంలో భాగమేనని పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులు మిల్లర్లకు ధాన్యాన్ని అందిస్తే అక్కడ నుండి రైతు భరోసా కేంద్రాలకు తరలించే ప్రక్రియ మిల్లర్లదేనని నిబంధన ఒప్పందంగా ఉందని, దానిని పట్టించుకోకుండా రైతులను బెదిరించి, భయపెట్టి వారి చేతనే రైతు భరోసా కేంద్రాలకు తరలించే ప్రయత్నం మిల్లర్ల యాజమాన్యం చేస్తుందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం వలనే రైతులు ఇటువంటి ప్రైవేట్ మిల్లర్ల దోపిడీకి బలి కాక తప్పడం లేదని, ఇందులో రాజకీయ నాయకులతో పాటు అధికారుల ప్రమేయం ఉన్నట్టు ఎపి రైతు సంఘం గుర్తించిందని కావున, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల పండించే ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేపట్టాలని, అనేక అక్రమాలకు పాల్పడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మిల్లర్లపై అలాగే యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాంబాబు (రవి) రైతులకు క్షమాపణ కోరుతూ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో దోపిడికి పాల్పడుతున్న ప్రైవేటు మిల్లర్ల వద్ద ఎపి రైతు సంఘం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని తెలిపారు. దానికి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-సీతంపేట : మండలం ఎస్టీ న్యూ కోలని లో నివాసం ఉంటున్న శేషపు చంద్రశేఖర్(చిన్న) 23 తండ్రి గోవిందరావు బుధవారం రాత్రి పది గంటల సమయంలో స్కూటీపై సీతంపేట వస్తుండగా గడి గుడ్డి ఎదురుంగ డివైడర్ ఢీకొని తీవ్ర గాయాలు అవ్వడంతో కుటుంబ సభ్యులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రధమ చికిత్స అందించి పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జేమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ గురువారం ఉదయం నాలుగు గంటల సమయంలో మృతి చెందడం జరిగిందని ఈ సంఘటనపై సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ వై.అమ్మనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతులకు తల్లి ఐదు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో తండ్రి గోవిందరావు ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు చంద్రశేఖర్ (చిన్న) పెద్ద కుమారుడు వంశీతో కలిసి మెలిసి ఎంతో అన్యోన్యంగా ఉండేవారని విధి ఈ విధంగా చిన్న కుమారాడిన్ని మృత్యువు అకాలంగా కబలించడంతో కుటుంబం ఒక్కసారి నిరాష నిస్పృహకు గురి అవటం జరిగిందని తండ్రి ఆవేదనకు గురిచేసింది కన్నీరు మున్నీరయ్యారు. మృతుడని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో శవ పంచనామా చేసి సీతంపేట తమ స్వగృహం తీసుకువచ్చిన అనంతరం దహన సంస్కారాలు చేశారు. మృతుడు అందరితో స్నేహభావంగా, సోదరి భావంతో మెలగడంతో పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు. దహన సంస్కారాలకు పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ హాజరై రూ 10వేలు అందించారు.

మెడికల్ కాలేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణానికి సంబంధించి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పరిశీలించారు. గురువారం పార్టీ నాయకులు కూటమి నేతలతో కలిసి మండలంలోని నర్సిపురం గ్రామంలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం పి పి పి విధానం ద్వారా మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్న సంగతి తెలిసిందే. దీని నిర్మాణం కోసం నర్సిపురం గ్రామంలో అనువైన స్థలాన్ని పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధికారులకు గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన పిపిపి విధానం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని, ఈ విధానం ద్వారా మెడికల్ కాలేజ్ నిర్మాణం జరిగితే ప్రజలకు, ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ స్థల పరిశీలనలో ఆయన వెంట గ్రామ ఎంపీటీసీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టాపు రమణ, చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

సూరంపేటలో బియ్యం సేకరణ గోదాము ప్రారంభం

- ధాన్యం నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధర అందించాలి

- గోనె సంచులు, రవాణాలో లోటుపాట్లు ఉండరాదని మిల్లర్లకు ఆదేశాలు

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం/సీతానగరం : సీతానగరం మండలం సూరంపేటలో ఏర్పాటుచేసిన ఎఫ్.సి.ఐ బియ్యం సేకరణ గోదామును జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యం ఆడించాక ఈ రోజు నుంచి బియ్యాన్ని గొదాములో నిల్వ ఉంచడం జరుగుతుందన్నారు. ఈ గోదాముకు 66,643 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని త్వరగా గోదాముకు అందించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులను సమన్వయం చేసుకోవాలని జేసీ మిల్లర్లకు సూచించారు. అనంతరం సీఎంఆర్ బియ్యాన్ని గోదాములోకి పంపారు. అంతకుముందు సూరంపేట రైతు సేవా కేంద్రం, చినరాయుడుపేటలోని రైస్ మిల్లులను జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో ఆడిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధరను ఇవ్వాలని, వారికి అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని అన్నారు. ఆర్ఎస్కె వద్ద ఉన్న రైతులతో ముచ్చటించిన జేసీ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించు కుంటున్న సంగతిని అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకరిస్తుందని, ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించే సమాచారంలో అవగాహన లేమితో తప్పుగా బటన్లు నొక్కవద్దని, వాస్తవ సమాచారాన్ని మాత్రమే అందించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంసీఎస్ శ్రీనివాస్, డిఎస్ఓ, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవి, ఎంఎస్ఓ ఎస్. అవినాష్, ఇతర మిల్లర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణతో ఆహ్లాదం

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: చెరువులను సుందరీ కరణ చేయడం మూలంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం లభిస్తుందని, అంతేకాకుండా నిత్యం వ్యక్తిగత పనులపై బిజీగా ఉండే వారికి మానసిక ప్రశాంతత కూడా ఉంటుందని, పచ్చని మొక్కల మధ్యకాలం గడిపితే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆక్సిజన్ శాతం శరీరంలో పెరిగి రక్త ప్రసరణ మెరుగుపడుతుందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. పల్లె పుష్కరిణి పథకం ద్వారా ప్రభుత్వం చెరువుల సుంద్రీకరణ చేపట్టింది. ఈ పథకం ద్వారా ఇప్పటికే మండలంలో అనేక చెరువులో సుందరీకరణ పనులు జరుగుతుండగా వీటిలో నర్సిపురం గ్రామ చెరువును ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ,చెరువులను సుందరీకరణ చేసుకోవాలని ఇది ఎన్నో తరాలకు మార్గదర్శకంగా ఉంటుందని కొనియాడారు. చెరువు పరిసర ప్రాంతాల్లో కూడా పచ్చని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని దాని మూలంగా వృద్ధులకు ఎంతో దోహదపడుతుందని సూచించారు. విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, బెంచీలు చిన్నచిన్న గుడారాలు వంటివి ఉంచి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. మంచి నీరు, మరుగుదొడ్లు కూడా అందుబాటులో ఉండాలన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- పిహెచ్‌సిని జాయింట్ కలెక్టర్ పరిశీలన

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గరుగుబిల్లి : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పార్వతీ పురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును గురువారం జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పరిశీలించా రు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్య సహాయం నిమిత్తం వచ్చే వారికి,అదే విధంగా వార్డుల్లో అందుతున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మందులు నిల్వలు పూర్తి స్థాయిలో ఉండేలా తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది తగు చర్య లు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈపరిశీలనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి,వైద్య సిబ్బంది ఎన్ జగదీశ్వరి, చింతాడ ఉదయకుమారి,బురిడి ఫకీరునా యుడు,పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో జిల్లా ఫస్ట్ : కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన వినతులను పరిష్కారం చేయడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు కృషిచేసిన జిల్లా అధికారులను కలెక్టర్ అభినందించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ వినతులపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయిన తర్వాత మరలా పునఃప్రారంభం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల, జిల్లాస్థాయిలో జరిగే పీజీఆర్ఎస్లో వచ్చిన వినతులను నాణ్యతతో కూడిన పరిష్కారం ఉండాలని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారం పట్ల అర్జీదారులు సంతృప్తి చెందాలని సూచించారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అలాగే వీటిని ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున ప్రతీ అధికారి బాధ్యతగా వ్యవహరించి వినతులను పరిష్కరించాలని అన్నారు. అలాగే అర్జీల పరిష్కారం కొరకు నిర్దేశించిన పట్టిక ద్వారా వివరాలు తెలియజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టే ప్రజా స్పందనలో అర్జీల పరిష్కారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసేలా పరిష్కారం ఉండాలని హితవు పలికారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరిష్కార విషయంలో సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలని, అంతేగాని కాలయాపన చేయరాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, ఎస్డిసీ పి. ధర్మచంద్రారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

14 మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్ గ్రేడ్ :

ఐసిడిఎస్ సిడిపిఓ ఎస్తేరి రాణి

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని 14 మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేట్ గా చేయడం అయిందని మండల సిడిపిఓ ఎస్తేరి రాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఉన్న 14 మినీ అంగన్వాడి కేంద్రాలైన సున్నం మెట్ట, ముసరలంక, శివ నగరం, బలియాగూడ, బల్లుగూడ, గాంధ, జామిగూడ, జుర్రుపాడు, పోదుజోల, శుక్ర పుట్టు, కొంతు గూడా, చంప గూడ, పూలు కూడా మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయడం జరిగిందని, అంగన్వాడి కార్యకర్తలకు, సూపర్వైజర్లకు, బ్లాక్ ప్రాజెక్టు కోఆర్డినేటర్స్ కు, ఫైవ్ జి సాంసంగ్ చరావానీలు ప్రభుత్వం అందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర వార్తకు స్పందన

పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంట ఏర్పాటు

విశాలాంధ్ర-జికే విధి : రింతాడ గవర్నమెంట్ ఆశ్రమ పాఠశాలలో వంటగది ఆవరణలో కనీసం ఇంకుడు గుంట లేక మురుగు నీరుతో దుర్గంధం వెదజల్లుతుందనీ విశాలాంధ్ర వార్తకు పాఠశాల యాజమాన్యం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, ఏఎంసి డైరెక్టర్ చింతపల్లి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మొట్టడం శరభ న్నదొర స్పందించి తక్షణమే పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంట ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో గ్రామస్తులు ,పిల్లలు తల్లిదండ్రులు పాఠశాల ఇబ్బందికి అభినందనలు తెలిపారు.

బీ టీ రహదారి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయండి

రూ.5 కోట్లతో రహదారి నిర్మాణానికి జడ్పిటిసి శంకుస్థాపన

విశాలాంధ్ర-చింతపల్లి : బలపం పంచాయతీ కోరుకొండ గ్రామం నుండి సూర్తి.పల్లి వరకు సుమారు 6 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి స్థానిక సర్పంచ్ కొర్రా రమేష్ నాయుడుతో కలసి జడ్పిటిసి పోతురాజు బాలయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అభివృద్ధికి నోసుకొని పంచాయతీ బలపం పంచాయతీ అని ఈ పంచాయతీలో చాలా గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవన్నారు.ఇటువంటి తరుణంలో కోరుకొండ గ్రామం నుండి సూర్తి పల్లి వరకు సుమారు 6 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. ఈ రహదారి మంజూరు చేయడం వలన సుమారు 15 గ్రామాల ప్రజలకు రహదారి అందుబాటులో ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రహదారి పనులు మొదలు కావడంతో ఆయా గ్రామల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఈ రహదారి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా గుత్తేదారు కు ఆయన సూచించారు. మిగతా గ్రామాలకు కూడా రహదారి సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదే క్రమంలో లోతుగెడ్డ వంతెన నుండి మూలకొత్తూరు వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని, రాకపోకలకు బలపం, కుదుముసారి పంచాయతీల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అల్లూరి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ ఎనిమిది కిలోమీటర్ల రహదారి బాగు పడితే రెండు పంచాయతీల ప్రజలతో పాటు, ఆ పంచాయతీ లను ఆనుకుని ఉన్న ఇతర పంచాయతీ లకు చెందిన గ్రామాల ప్రజలకు కూడా రహదారి, రవాణా సమస్యలు తీరుతాయన్నారు. వెంటనే ఆ రహదారి బాగు చేసి ఆ ప్రాంత ప్రజల రహదారి కల నెరవేర్చడానికి కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.అదే క్రమంలో చెరువూరు నుండి లాచేరు వరకు సుమారు 6 కిలోమీటర్ల రహదారి నిర్మాణం కొరకు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఆ రహదారి నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పి.కామరాజు, వార్డు సభ్యులు లింగరాజు, వైసీపీ నాయకులు బాబురావు, లక్ష్మి, కూటమి నాయకులు గబులంగి అప్పారావు, చిట్టిబాబు, వీరయ్య దొర, రాజారావు, గ్రామ పెద్దలు నీలకంఠం, రామారావు, చిట్టిబాబు, అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు..

గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడమే ఈక్రీడ లక్ష్యం

తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు

విశాలాంధ్ర-పాడేరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జూనియర్ కాలేజీ క్రీడమైదానంలో ఆడించేటటు వంటి క్రికెట్ టోర్నమెంట్లో గిరిజన క్రీడాకారులను ప్రోత్య ఇస్తూ వారి ప్రతిభాను వెలికి తీసే భాగంలోనే ఈ యొక్క టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్టగుల్లి సుబ్బారావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం జూనియర్ కాలేజ్ క్రీడా మైదానంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఎన్సిసి నెంబర్స్ తో కలిపి గిరిజనులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.గిరిజన ప్రాంతంలో క్రీడా క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ టోర్నమెంట్ యొక్క ప్రధాన లక్ష్యమని, గిరిజన క్రీడాకారులు అండర్-19లో ఆడాలన్నదే తన ఆకాంక్షమన్నారు. మట్టిలో మాణిక్యాలగా ఎదిగే గిరిజన బిడ్డలని ప్రోత్యయిస్తే గిరిజన ప్రాంతానికే పేరు తెస్తారని ఆయన అన్నారు. ఈ టోర్నమెంట్లో మొదటి బహుమతి లక్ష రూపాయలు రెండో బహుమతి 50వేలు అందించడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్కు ఆర్థిక సాయం అందించిన వర్తక సంఘం, సర్పంచ్ ఉషారాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మైదానం పాడవకుండా ఐరన్ పెన్సిన్,ఎల్ఈడి బల్బులు, వేయించానున్నట్లు ఆయన తెలిపారు. క్రికెట్ టీమ్లో 11 మెంబర్స్ క్రీడాకారుల్లో ఆరుగురు గిరిజనులే ఉండాలని మిగిలిన వారు ఎవరైనా పర్వాలేదన్నారు.ఈ కార్యక్రమంలో బాకూరు మహేష్, నానాజీ, రామారావు కొత్తపల్లి సింహాచలం, నాయుడు పాల్గొన్నారు.కాగా ప్రతి ఏడాది యువతను ప్రోత్సహించడంతోపాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు చేయడంలో ఎప్పుడు తెదేపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు ముందంజలోనే ఉంటారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్తున్నారు.

ఆన్లైన్ నమోదుతో పారదర్శకత పెరుగుతుంది

విశాలాంధ్ర-జి.మాడుగుల : అంగన్వాడీల ద్వారా గర్భిణులు-బాలింతలకు పోషకాహారం క్రమం తప్పకుండా ఇవ్వాలని ఎంపీపీ అప్పలరాజు తెలిపారు. జి.మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కె.బి.చంద్రమణి దేవి, ఎంపీపీ అప్పలరాజు, తహసీల్దార్ రాజ్ కుమార్ అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు అందజేయడంతో పాటు, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చిన కార్యకర్తలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు గిరిజన ప్రాంతాల్లో పిల్లల పోషణ, ఆరోగ్యం, విద్య కు కేంద్ర బిందువులుగా పనిచేస్తున్నాయని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు సరైన సమయానికి పోషకాహారం ఆరోగ్యపరీక్షలు, ఇనుము-పొట్టాశయం మాత్రలు, బరువుల కొలతలు వంటి సేవలను నిరంతరం అందించాలని సూచించారు. చిన్న పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మొబైల్ ఫోన్ల ద్వారా గర్భిణుల వివరాలు, పిల్లల బరువు, ఎత్తు, పోషణ స్థాయి, పంపిణీ వివరాలు, తల్లీబిడ్డల వైద్యపరీక్షలు అన్నీ ఆన్లైన్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆన్లైన్ నమోదు వల్ల పారదర్శకత పెరుగుతుందనీ అన్నారు. ప్రతి లబ్ధిదారుని పర్యవేక్షించడం సులభం అవుతుంది" అని చెప్పారు. ప్రతి గ్రామంలో 0-6 ఏళ్ల పిల్లల జాబితాను అప్‌డేట్ చేయాలనీ, పోషకాహారాన్ని సమయానికి పంపిణీ చేసి ఆన్లైన్‌లో వెంటనే నమోదు చేయాలనీ, గర్భిణులు, బాలింతలకు చెకప్‌లు, ఆరోగ్య సూచనలు ఇవ్వాలనీ, పిల్లలకు ప్రీ-స్కూల్ విద్య, ఆటలు, శారీరక, మానసికాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెయ్యి రోజుల పోషణ పథకం, బాలల రక్షణ మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలనీ, ఇంటింటికి వెళ్లి తల్లులకు పోషణ-స్వచ్ఛత -వాక్సినేషన్‌పై సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరతగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-జి. మాడుగుల : పెండింగ్ కేసులు త్వరిత గతినా పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని పాడేరు డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మమ్మద్ ఆదేశించారు. గురువారం అయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ పరిశీలించారు. పోలీస్ సేవలు మెరుగు పరచాలని సూచించారు. అయన వెంట సీ ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-హుకుంపేట : విశాఖపట్నం గీతం ఇం

జినీరింగ్ కళాశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురై ఒక్క రు మృతి చెందగా,మరో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయలు పాలయ్యారు. కారు నుజ్జునుజ్జయింది. దీనికి సంభందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలో గల రాళ్లగడ్డ సమీ పంలోని గురువారం ఉదయం విశాఖ నుంచి కారులో 6గురు స్నేహితులు కలిసి అల్లూరి జిల్లా వంజంగిలో టూరిస్ట్ ప్రదేశం మంచు అందాలు తిలకించి తిరిగి అరుకు అందాలు తిలకించ టనికి వెళ్తున్న కారు మండల కేంద్ర సమీపంలో ఉన్న రాళ్లగడ్డ బిడ్జి వద్ద ఢీకొన్న సంఘటనలో వైజాగ్ గీతం కాలేజీలో ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న గుడివాడ రుద్రసాయి(19) ఘటన స్థలంలో మృతిచెందగా అదే కళాశాలో బీటెక్ చదువుతున్న నారికంట్ల శ్రీయన్ నిహార్, శ్రీవత్సవ అనే ఇద్దరి యువకులు తీవ్రంగా గాయలు కావటంతో అమార్గంలోని ప్రయాణించే ప్రయాణికులు చూసి 108కు పోలీ సులకు సమాచారం అందించటంతో తెలిసిన డీఎస్పీ షెక్వాద్ అమద్, స్థానిక సీఐ సన్యాసినా యుడు ఎస్ఐ సూర్యనారయ ణలు కలిసి ప్రమాదం జరిగిన సంఘటన స్థలం పరిశీ లించి హుటా హుటిన గాయలు పాలైన విద్యార్థులకు మెరు గైన వైద్యం కోసం జిల్లా ఆరోగ్య కేంద్రనికి 108లో తరలించి మృతి చెందిన రుద్ర సాయికు పోస్టు మరం నిమితం తరలిం చారు,విద్యార్థుల కుటుంబలు వివరా లు తెలుసుకోని బందువు లకు సమాచారం అందించి కేసు నామోదు చేసి మృతి గల కార ణాలు దర్యాప్తు చేస్తామని వారు తెలిపారు. తోటి విద్యార్థులు మృతి చెందిన రుద్ర సాయిను గాయలు తగిన స్నేహిలకు చూసి బాధపడ్డారు.

జెవి సత్యనారాయణమూర్తి సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : జెవి సత్యనారాయణ మూర్తి సేవలు ఎనలేనివని చింతపల్లి మండలానికి చెందిన పలువురు సిపిఐ నాయకులు కొనియాడారు. ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారిగా అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు విచ్చేసిన ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ జెవి సత్యనారాయణమూర్తి ని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, చింతపల్లి మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, చింతపల్లి విశాలాంధ్ర విలేఖరి షేక్ ఖాసిం వల్లి గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖాసిం వల్లి మాట్లాడుతూ జెవి సత్యనారాయణమూర్తి సిపిఐ పార్టీలో సాధారణ కార్యకర్త స్థాయి పార్టీ బలోపేతానికి గాక ప్రజల సంక్షేమానికి అహర్నిశలు ఉద్యమాలు చేసి అంచలంచలుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి వరకు ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా నేడు ది విశాఖపట్నం కోఆపరేటివ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై బ్యాంకు సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నరని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాక్సైట్ తవ్వకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలను అడ్డుకొని తీరుతాం : చౌడుపల్లి సర్పంచ్ లలిత

విశాలాంధ్ర-చింతపల్లి :- కేంద్ర, రాష్ట్రాలలోని కూటమి ప్రభుత్వాలు మన్య ప్రాంతంలో సహజ సిద్ధంగా నిక్షిప్తమై ఉన్న బాక్సైట్ త్రవ్వకాలకు ఆలోచన చేస్తే అడ్డుకొని తీరుతామని చౌడుపల్లి సర్పంచ్ గెమ్మెల లలిత అన్నారు. వైసీపీ నాయకులు, పీసా కమిటీ సభ్యులతో చౌడుపల్లిలో సమావేశమైన ఆమె మన్య ప్రాంతంలోని సహజ సిద్ధ వనరులైన బాక్సైట్ నిక్షేపాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కన్నేసి కాజేయాలని చూస్తున్నాయని, అటువంటి నిర్ణయాలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని, లేనిపక్షంలో కూటమి నిర్ణయాలను అడ్డుకొని తీరుతామని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకుడు గెమ్మెల సింహాచలం, పంచాయతీ వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

బాక్సైట్‌ని ప్రారంభిస్తే మనం స్వాగతిద్దామా : భారత్ ఆదివాసీ పార్టీ

విశాలాంధ్ర-సీలేరు : బాక్సైట్ తవ్వకాలు ప్రారంభిస్తే ఆదివాసీలుగా మనం స్వాగతిద్దామా అని ఆదివాసీలను భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు ప్రశ్నించారు. బాక్సైట్ తవ్వకాలు 2026లో ప్రారంభిస్తామని నేషనల్ అల్యూమినియం కంపెనీ(నాల్కో) సీఎండీ బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ ప్రకటన చేయడంతో ఆదివాసీ నెట్ జన్స్ 2026 నుండి బాక్సైట్ అన్ని ఏజెన్సీ ప్రాంతాలలో మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయని మెసేజ్‌ని ఫార్వార్డ్ చేస్తున్నారన్నారు. నాల్కో లేదా ఆన్ రాక్ లేదా జిందాల్ లేదా ఇంకొకడు ఎవరైనా బాక్సైట్ లేదా మైనింగ్ తవ్వడమే వాళ్ళ పనివాళ్ళ పని వారు చేస్తూంటారు, అడ్డుకోవడం ఆదివాసీలుగా మన పని కదా, కానీ మనం భయపడి తిరగబడకపోతే వాడే కాదు, వాడి కుక్క కూడా మనల్ని భయపెడతాది. ఈ ప్రపంచానికి పోరాటం నేర్పింది మనం, ఈ దేశానికి మూలవాసులం మనం. ఈ దేశం మనది, ఈ దేశాన్ని నడిపించే రాజ్యాంగంలో 5వ, 6వ షెడ్యూల్డ్ మనవి, మన కోసం భూబదాలయింపు నిషేధ చట్టాలు 1917, 1/59, 1/70 ఉన్నాయన్నారు. పార్లమెంట్ తో సమానమైన పీసా చట్టం మనది, అసెంబ్లీతో సమానమైన మిని అసెంబ్లీ అయినా గిరిజన సలహా మండలి మనది ఇన్ని చట్టాలు, హక్కులు ఉండగా వాటిని ఉపయోగించు కోవడంలో మనం విఫలమౌతున్నామన్నారు. బాక్సైట్ లేదా ఇతర ఖనిజ సంపద దోచుకొని పోవడానికి ఇలాంటి వారికి వస్తుంటారన్నారు. ఆదివాసీలను నిర్వాసితులను చేస్తుంటారన్నారు. ఇలాంటి కార్పొరేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం షరా మాములే. ఆదిమానవుడి వారసులైనా ఆదివాసీలు అడవిలో జీవించడానికి ప్రారంభించిన పోరాటం నేటి వరకు కొనసాగుతుంది. ప్రస్తుతం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని అంబికాపూర్‌లో బగ్గు గనుల విస్తరణకు వ్యతిరేఖంగా అక్కడి ఆదిలాసీలు పోరాడుతున్నారు. ఈ దేశ స్వాతంత్ర్యం కోసం మొట్టమొదట ప్రాణత్యాగం చేసిన బాబా తిల్కామాంఝీ, బిర్సాముండా, కొమరంభీం, గాం గంటందొర, గాం మల్లుదొర, మొట్టడం వీరయ్యదొర, తగ్గి వీరయ్యదొర, బోనంగి పదాల్, కారం తమ్మన్న దొర, సుబ్బారెడ్డి, రాంజీగోండ్ ఇలా ఎంతోమంది వీరుల రక్తానికి పుట్టిన మనం, మన స్వార్థం కోసమో,భయపడో పోరాడకపోతే భవిషత్తు తరాల పరిస్థితి ఏంటని, రాజ్యాంగ పరంగా, చట్ట పరంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడడానికి ముందుంటానని ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గిరిజన మహిళలకు వివాహమాడి... వారి పేరిట గిరిజనేతరుల హవా..?

విఆర్‌ఓ, కార్యదర్శులు కుమ్మక్కై ఏదైనా అనుమతులు మంజూరు..
పరోక్షంగా గిరిజన హక్కులు చట్టాలను కాలరాసేది రెవిన్యూ శాఖే...!

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన ప్రాంతాల్లో రోజు రోజుకు 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరుల ఆగాడాలు మితిమీరిపోతుంది. గిరిజన మహిళలకు వివాహమాడి వారి పేరిటా భూములు కొనుగోలు చేయడం, వారి పిల్లలకు సైతం ఎస్ టి బోగస్ సర్టిఫికెట్స్ చేయడం పోటీ ప్రపంచంలో వారి పిల్లలకు కార్పొరేట్ చదువులు చదివించి ఉద్యోగానికి అర్హత సాధించడం ఇలా అసలైన గిరిజనుడికి అన్యాయం చేస్తున్నారు ప్రతి దాంట్లో గిరిజనేతరుల హవా..?కొనసాగుతూనే ఉంది దానికి కట్టడి చేయాల్సిన పంచాయతీ విఆర్‌ఓలు, కార్యదర్శులు వారితో కుమ్మక్కై ఏదైనా అనుమతులు కూడా ఇట్టే మంజూరు..చేస్తున్నారనడంలో సందేహమే లేదని చెప్పాక తప్పదు...? వాస్తవానికి చెప్పాలంటే వి ఆర్ ఓ లు, కార్యదర్శులు పరోక్షంగా గిరిజన హక్కులు చట్టాలను కాలరాసేది రెవిన్యూ శాఖే...? అనడంలో ఎటువంటి అనుమానమే లేదని చెప్పాలి. పాడేరు పట్టణంలో చూస్తే ఇక్కడ కూలీ నాలి చేసి కుటుంబ పోషణ చేస్తున్న వారికి సెంటు భూమి ఇవ్వాలని అడిగితే వంద రకాల సాకులు చెప్పే వి ఆర్ ఓ లు అదే గిరిజనేతరుడికి వివాహం చేసుకుని పాడేరులో వచ్చి బ్రతుకుతున్న గిరిజన మహిళలకు మాత్రం ఓ.. ఏరకమైన షరతులు లేకుండా ఇంటి స్థలం కావాలంటే దగ్గరుండి పనులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అంటే వారి మీద ఎంత ప్రేమ ఉందో గిరిజనులు అర్థం చేసుకోవాలి, ఇదివరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంటి లేని పేదవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదల చేయడమే తడవు బినామీ పేర్లతో దరఖాస్తు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. అంతే కాదు వాళ్లను వి ఆర్ ఓ లు కార్యదర్శులు పరోక్షంగా సహకరిస్తున్నట్లు కూడా విశ్వాసం నీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. అసలైన గిరిజనుడు ఎక్కడైనా చిన్నపాటి గుడిసె వేసుకుని కూలీ నాలి చేసి కుటుంబ పోషణ చేస్తున్న తరుణంలో అన్ని అడ్డంకులన్నట్లు హడావిడిగా రెవిన్యూ అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకొంటు ఆ గుడిసె కూల్చడానికి కూడా వెనుకడబోవడం లేదంటే ఏమని చెప్పాలి. పాడేరు పట్టణంలో చాలా మంది గిరిజన మహిళలు గిరిజనేతరులకు వివాహాలు చేసుకొని కూడా వారి తల్లిదండ్రుల పేరిట ఇప్పటివరకు ఆధార్ కార్డులు కావచ్చు, బ్యాంక్ ఖాతాలు కావచ్చు, కొనసాగిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు గిరిజనేతరుడితో వివాహం చేసుకున్న గిరిజన మహిళలకు పుట్టిన బిడ్డల సైతం గిరిజన మహిళ తల్లిదండ్రుల పేరిట సర్టిఫికెట్స్ చేసిచదువులు కోన సాగిస్తున్నట్లు కూడా విశ్వాస నీయ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది...? వీటన్నింటికి నిగ్గు తేల్చాల్సింది రెవెన్యూ అధికార్లు మాత్రమే ఎటు దారి తీస్తుందో వేచి చూడాల్సిందే మరి.

అక్రమ రంగురాళ్ళ తవ్వకందారులతో సెటిల్మెంట్... ఫారెస్ట్ చట్టాలకు తూట్లు..!

ఏఎస్‌పీ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు

విశాలాంధ్ర-అడ్డతీగల : మండలం దుప్పులపాలెం, మల్లవరం మామిళ్ళు గ్రామాలకు ఆనుకుని ఉన్న తవసికొండ రిజర్వుడ్ ఫారెస్ట్ పరిధిలో దూలి క్వారీలో జరుగుతున్న రంగురాళ్ళ అక్రమ త్రావ్వాకాలకు అడ్డతీగల ఫారెస్ట్ రేంజీర్ హస్తం ఉన్నట్లు తెలుస్తుందని, కంచె చేను మేస్తే కాసేదెవరు అని ప్రశ్నిస్తూ ఫారెస్ట్ రేంజీర్ సహకారంతోనే దళారులు, ముఠా నాయకులు చెలరేగిపోతున్నారని "ఆదివాసీ సంక్షేమ పరిషత్"(274/16) అల్లూరి జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు ఆరోపించారు. అటవీని నాశనం చేస్తూ అక్రమ మట్టి త్రావ్వకాలు జరుపుతూ మట్టిని అక్రమంగా తరలిస్తున్న ముఠాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసిన అధికారులే అక్రమ రంగురాళ్ళ త్రావ్వకం దారులతో సెటిల్మెంట్స్ చేసుకుని కేసులు పెట్టకుండా వదలేస్తున్నారని ఆయన అన్నారు. తపసికొండ రిజర్వుడ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న దూలి క్వారీలో అక్రమ రంగురాళ్ళ త్రావ్వకాలు జరిపి మట్టి తరలించి తిరుపతమ్మ క్వారీ క్రింద ఉన్న చిన్న కాలువలో తరలించిన మట్టిని కడుగుతుండగా 13 మందితో కూడిన ఒక ముఠాను ముఠా నాయకుడితో సహా ఈ నెల ఆరవ తేదిన శనివారం ఉదయం ఫారెస్ట్ బీట్ ఇంచార్జ్ తన సిబ్బందితో నేరుగా పట్టుకోవటం జరిగిందని అయితే అడ్డతీగల ఫారెస్ట్ రేంజీర్ ఆ ముఠాపై గాని ముఠా నాయకుడిపై గాని ముఠాను ప్రోత్సహించే దళారీపై గాని ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డతీగల ఫారెస్ట్ రేంజీర్ సెటిల్మెంట్ చేసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయని ఆయన అన్నారు. అడ్డతీగల ఫారెస్ట్ శాఖ ఫారెస్ట్ చట్టాలకు తూట్లు పొడుస్తుందని ఆయన అన్నారు. రాయి క్వారీ బాంబులతో బ్లాస్టింగ్ చేయటం వాస్తవమే అని బ్లాస్టింగ్ చేసిన ముఠాతో సెటిల్మెంట్ చేసుకుని ఆ కేసు తప్పుదు త్రోవ పట్టించారాని, అలాగే గొద్దలి క్వారీ విషయంలో కూడా సెటిల్మెంట్ చేసుకున్నారని అందుకే రేంజీర్ గారు సకాలంలో స్పందించలేదని డి యఫ్ ఓ గారికి చరవాణి ద్వారా తెలియజేస్తే ఆయన రేంజీర్ గారికి చర్యలు తీసుకోవాలని చెప్పిన లెక్క చేయకుండా గొద్దలి క్వారీలో ఉన్న ముఠాలు అక్కడి నుండి వెళ్లిపోయేంతవరకు ఆ క్వారీ వద్దకు వెళ్ళలేదని ముఠాలు వెళ్ళిపోయిన తర్వాత రోజు ఫారెస్ట్ సిబ్బంది వెళ్లారని ఫారెస్ట్ శాఖ సహకారం లేకుండా స్వేచ్ఛగా నిర్భయంగా ఎవరు అక్రమ రంగురాళ్ళ త్రావ్వకాలు చేయలేరని ఆయన అన్నారు. విషయాలపై ఉన్నంతధికారులు దుప్పులపాలెం గ్రామంలో కూడా గ్రామసభ పెట్టి విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

అణగారినవర్గాల ఆశా కిరణం 'ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి'

ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాంబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : అణగారిన, బడుగు , బలహీన వర్గాల, ఆదివాసి గిరిజనుల ఆశా కిరణం ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి అని ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్, కే రాంబాబు అన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ, %ాఖుఎఱఋంఱ =అస్త్రష్రం ాతీశీవషిఱశీఅ జశీఎఎఱవవ (ాూాజ%) అనే స్వచ్ఛంద సేవ సంస్థను అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం అయిన పాడేరులో.బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతపల్లి లో గురువారం వారు మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగ పరమైన, చట్టపరమైన హక్కులు కోల్పోతున్న అణగారిన, బడుగు, బలహీనవర్గాలు, అణచివేతకు గురవుతున్న ఆదివాసీ ప్రజలను చైతన్య పరచడంలో భాగంగా భారత రాజ్యాంగం లో పొందుపరిచిన 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలు వారికి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు, చట్టాలు, 1/70 చట్టం ,పెసా చట్టం నిర్వీర్యం అవుతున్న తరుణంలో ఆదివాసీ హక్కుల పరిరక్షణ కమిటీ అనే ఈ సంస్థ భావి తరాలకు అభ్యుదయంగా, హక్కుల సాధనకు చట్టబద్ధంగా ఆదివాసీ ప్రజలు తరుపున కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ ప్రధాన కార్యదర్శి కే రంగారావు, జాయింట్ సెక్రటరీ జీ కొండబాబు, కోశాధికారి కే పూర్ణారావు, సభ్యులు కే సుందరరావు(హర్ష), వి. రామారావు, ఎస్ వెంకట రమణ, వి నాయుడు, కే సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఏర్పాటుచేసి పిల్లల భవిష్యత్తుకు పునాది వెయ్యండి

వాలమూరు గ్రామ ప్రజల ఆవేదన

విశాలాంధ్ర-మారేడుమిల్లి : అల్లూరి జిల్లా, మారేడుమిల్లి మండలం, గుజ్జుమామిడి వలస పంచాయతీ పరిధిలోని వాలమూరు గ్రామ చిన్నారుల విద్య భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. గ్రామంలోని 1వ, 2వ తరగతి చదవ వలసిన సుమారు 15 నుంచి 20 మంది పిల్లలు, సరైన పాఠశాల వసతి లేక విద్యకు దూరమవుతున్నారు. వారి భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్న గ్రామ ప్రజలు విద్యా సమస్యను అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసారు.

శిథిలమైన భవనం, అదృశ్యమైన విద్య : గ్రామప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో ఇక్కడ 1, 2 తరగతుల కోసం గిరిజన విద్యా వికాస కేంద్రం పాఠశాల ఉండేది. దాదాపు 15 సంవత్సరాల క్రితం వరకు ఉపాధ్యాయుల ద్వారా విద్యా తరగతులు సక్రమంగా జరిగేవి. అయితే, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, దానిని అధికారులు పట్టించుకోకపోవటంతో కొన్నేళ్ల పాటు పాఠశాల నిలిచిపోయింది. అదే సమయంలో గ్రామస్తులకు ఎటువంటి సమాచారం లేకుండానే ఈ పాఠశాల భవనం సంబంధిత శాఖల ద్వారా జంగిల్ స్టార్ రిసార్ట్ అధీనంలోకి వెళ్లినట్లు పాడయినా స్కూల్ భవనాన్ని మరమ్మత్తులు చేసి అటవీ శాఖ ద్వారా ఉపయోగంలో ఉందని తెలిపారు అయితే ఒకవైపు చిన్నారులు చదువు మధ్యలో ఆగిపోగా,పాఠశాలను స్థానిక రిసార్ట్ స్వాధీన పరచుకోవటం పై గ్రామ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు.

పసిపిల్లలకు తల్లి ఒడికి దూరం : అంగన్వాడీ విద్య పూర్తయిన తర్వాత, 1వ, 2వ తరగతి చదవాల్సిన చిన్నారులకు వాలమూరు గ్రామంలో పాఠశాల లేకపోవడంతో, తల్లిదండ్రులు వారిని చిన్న వయసులోనే తమ ఒడికి దూరంగా ఉంచి చదివించాల్సిన దుస్థితి ఏర్పడిందని పాఠశాలలు పంచాయతీ లేదా మండల పరిధిలో దూరంగా ఉండటంతో ఏ గత్యంతరం లేక, తల్లిదండ్రులు తమ పిల్లలను బంధువుల ఇళ్లలో ఉంచి చదివిస్తున్నారు.ఇంత చిన్న వయసులోనే పిల్లలను దూరంగా ఉంచడంతో చిన్నారులకు అనారోగ్య సమస్యలతో మృత్యువాత దాఖలాలు లేకపోలేదని ఇది ఏమాత్రం సమంజసం కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం పాఠశాల లేకపోవడంతో, అంగన్వాడీ పూర్తయిన చిన్నారులు కొందరు ఇంటికి చెట్టు పుట్టలకు,పరిమితమై, విద్యకు దూరమవుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు : ఈ సమస్య గురించి అధికారులకు తెలుస్తున్నప్పటికీ, వారు 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తున్నారని, 'అటవీ శాఖ అధీనంలో ప్రభుత్వ భవనం ఏదీ లేదు అని , ఈ వ్యవహారం పై స్థాయికి చెందినది' అన్నట్లుగా చేతులు దులుపుకుంటున్నారని గ్రామ ప్రజలు ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం చిన్నారుల భవిష్యత్తును పాడుచేయడమేనని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను గతంలో పీఓ గారి దృష్టికి పలుమార్లు తీసుకుని వెళ్లినట్టు తెలిపారు.

గ్రామ ప్రజల డిమాండ్ : వాలమూరు గ్రామ ప్రజల విద్యా సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి, పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వారిని, విద్యా శాఖమంత్రి వర్యులను కోరుతూ "ప్రతి చిన్నారికి ప్రాథమిక విద్య హక్కు అని దయచేసి మా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాల భవనం పునరుద్ధరణ లేక నూతన భవనం ఏర్పాటుపై 1, 2 తరగతులకు ఉపాధ్యాయులను నియమించి, పాఠశాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరుతు"సంబంధిత అధికారులు తక్షణమే వాలమూరు గ్రామాన్ని సందర్శించి, క్షేత్రస్థాయి సమస్యను పరిష్కరించి, గిరిజన చిన్నారుల విద్యకు భరోసా కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇక అంగన్వాడీ కేంద్రాల సమాచారం సులభతరం

164 మంది వర్కర్స్, సూపర్వైజర్స్ కు 172 ఫోన్లు పంపిణీ

విశాలాంధ్ర-కొయ్యూరు : దశాబ్ద కాలంగా కొయ్యూరు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పడుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో అంధ్చాల్సిన సాంకేతిక సమాచారం ఇక నుంచి సులభతరం కానుంది. ఈ మండలంలో పూర్తి స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు నుంచి తగిన సమాచారం అందక ఇటు అధికార్లు అటు కార్యకర్తలు పడే భాధలన్నీఇక నుంచి దూరం కానున్నాయి. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చొరవతో అందించే మొబైల్ ఫోన్లు పంపిణీ తో అందరు కార్యకర్తలు, కార్యాలయ ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లో గత కొన్నేళ్లుగా అంగన్వాడీ కార్యకర్తల నుంచి సంబధిత శాఖ మండల, జిల్లా అధికార్ల కు సమాచారం అందక ఆయా సెంటర్ల పిల్లలకు ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలు అధికారులకు వివరాలు అందక, చాల రాయితీలు పొందలేని పరిస్థితి ఉండేది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కొయ్యూరు మండలంలో ఉన్న 164 సెంటర్ల కి (శామ్సంగ్) మొబైల్ ఫోన్లు రావటంతో వీటిని గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి దేవమణి, బిపిసిశేఖర్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షులు బడుగు రమేష్ బాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మరియూ మాజీ జిసిసి ఛైర్మెన్ ఎంవీవీ ప్రసాద్ , సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐలు కిషోర్ వర్మ, శంకరరావులతో 164 మంది వర్కర్స్, 7గురు సూపర్వైజర్స్, 1బీపీసి లకు వీరి చేతుల మీదుగా మొబైల్స్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్బాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సరైన కమ్యునికేషన్ లేక, ఉన్న మొబైల్స్ పనిచేయక నరక యాతన పడే అన్నీ ప్రాంతాల్లో కార్యకర్తలకు ఈ మొబైల్స్ పంపిణీ తో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాచారం సకాలంలో అధికార్ల కు చేరటంతో పాటు, వర్కర్స్ కు సులభతరం కానుండటం పట్ల ఎంపీపీ, రమేష్ బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవివి ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు కాకూరి చంద్రరావు , వైస్ ఎంపీపీ నూకాలమ్మ,సి ఐ శ్రీనివాసరావు, ఎస్ ఐ లు అభినందనలు తెలిపారు.164 లో 75 ప్రధాన సెంటర్ల కు,37 మినీ అంగన్వాడీ కేంద్రాలకు వీటిని వారంతా పంపిణీ చేశారు.జిల్లలోనే అతిపెద్దమండలమై,కమ్యునికేషన్ నేటికీ 50శాతంప్రాంతాల్లో అందక ఉన్న ఈ మండలానికి ఒకేసారి అందరికీ మొబల్స్ అందటం వీరిఅవస్థలుగుర్తించన జిల్లాకలెక్టర్కు వీరంతాకృతజ్ఞతలుతెలిపారు..ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ సింహాచలం, సూపర్వైజర్స్ కనక మహాలక్ష్మి, బిపిసి శేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఈపీపై అధ్యయనాలకు దారితీసే ప్రొసీడింగ్స్ పుస్తకం ఆవిష్కరణ

డిజిటల్ ఎడ్యుకేషన్‌పై రెండురోజుల సెమినార్ విజయవంతం

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ యం. విజయభారతి ఆధ్వర్యంలో, పి.యం. ఉష స్కీమ్ సహకారంతో "డిజిటల్ ఎడ్యుకేషన్-పాలసీ ఇంప్లికేషన్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ: ప్రాస్పెక్ట్స్ & ఛాలెంజెస్" అంశంపై జరిగిన రెండురోజుల జాతీయ స్థాయి సెమినార్ విజయవంతంగా ముగిసింది. ఈ సెమినార్‌లో ప్రధాన ఆకర్షణగా సెమినార్ ప్రొసీడింగ్స్ పుస్తక విడుదల నిలిచింది. డిజిటల్ ఎడ్యుకేషన్ రంగంలో తాజా పరిశోధనలు, విధానాల అమలు, భవిష్యత్ అవకాశాలు, సవాళ్లపై సమగ్ర సమాచారం ఈ ప్రొసీడింగ్స్‌లో పొందుపరచడం విద్యా వర్గాలు అభినందించాయి. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ శర్మ వి.ఎస్. వేలూరి కీలకోపన్యాసంలో డిజిటల్ శిక్షణా విధానాల రూపకల్పన, న్యూ ఎడ్యుకేషన్ పాలసీలో సాంకేతిక వినియోగం గురించి వివరించారు. అనంతరం జి.డి.సి నందికొట్కూరు కామర్స్ లెక్చరర్ డాక్టర్ పరిమళాదేవి, క్లస్టర్ విశ్వవిద్యాలయం కర్నూలుకు చెందిన కె.వి.ఆర్ డిగ్రీ కళాశాల మాథమెటిక్స్ లెక్చరర్ డాక్టర్ టీ. సునీతల చేతుల మీదుగా సెమినార్ ప్రొసీడింగ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు పరిశోధకులు రెండురోజుల పాటు డిజిటల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి తమ పరిశోధన పత్రాలను సమర్పించగా, వాటిలో వినూత్న ఆలోచనలు మరియు ఉపయోగపడే సూచనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస పాత్రుడు, పి.యం. ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వి. రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వాహనదారులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు సూచన

విశాలాంధ్ర-కొయ్యూరు : ఆంధ్రప్రదేశ్ హై కోర్టు,(అమరావతి) ఆదేశాల మేరకు జాతీయ లోక్అదాలత్ (13 డిసెంబర్ 2025) సందర్భంగా పెడింగ్‌లో ఉన్న ఈచలాన్లను కాంపౌండ్ చేయుటకు ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సిఐ ఈ ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు కొయ్యూరు సర్కిల్ మరియు కొయ్యూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్లు కలిగిన వాహనదారులు అంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఐ ఈ ప్రకటనలో తెలిపారు. అలాగే 2024 మరియూ 2025 సంవత్సరాలకు సంబధించిన ఈ చలాన్లు గణనీయంగా పెండింగ్‌లో ఉన్నందున ఆన్లైన్‌లో పరిశీలించి లోక్ అదాలత్ అందిస్తున్న సౌకార్యాన్ని వినియోగించుకోవాలని సి ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కిషోర్ వర్మలు ఈ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

భారీ ర్యాలీకి వైసిపి నేతలు, కార్యకర్తలు తరలిరండి

ఎంపీపీ బడుగు రమేష్ బాబు పిలుపు

విశాలాంధ్ర-కొయ్యూరు : మెడికల్ కాలేజీల ప్రయివేటికరణకు వ్యతిరేకంగా పాడేరు జిల్లా కేంద్రంలో ఈనెల 15న నిర్వహించనున్న భారీఎత్తున చేపట్టే ర్యాలీలో పాల్గొనేందుకు వైసిపి కొయ్యూరు మండల పార్టీ వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మండల నాయకులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు అనుభంధ సంస్థలకు నియమింపబడిన కార్యకర్తలు ఈ కార్యక్రమం నకు హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ బడుగు రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూది దూది లేకుండా చేయడమే కాక రోడ్లపై 104, 108 అంబులెన్సు కనిపించకుండా కూటమి ప్రభుత్వ చేసిందని బకాయిలతో ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి ఆరోగ్య రంగం నాశనం చేశారని అన్నారు. కూటమి వైఫల్యానికి ఇంతకన్న వేరే సాక్ష్యం అవసరం లేదన్నారు. కోటి సంతకాల సేకరణ పూర్తి కావటంతో ఈ నెల 15న వైసిపి పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన పాడేరులో జరిపే ఈ భారీ ర్యాలీలో మండలం నుంచి వైసిపి శ్రేణులు, పార్టీ అన్నీ అనుభంద సంస్థల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని భారీ ఎత్తున తరలి వచ్చి ఈ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీపీ రమేష్‌బాబు కోరారు.

సమిష్టి కృషితో స్థానిక సంస్థలను కైవసం చేసుకోవాలి

మంగళగిరి నుంచి వచ్చిన కేంద్ర అడ్వైజర్ల బృందం సూచన

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కూటమి పార్టీలకు చెందిన ప్రతీ ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని మంగళగిరి కేంద్ర కార్యాలయ అడ్వైజర్ గాలి నరసింహమూర్తి, రాష్ట్ర గిరిజన విభాగం ఆర్గనైజర్ నిర్మల అన్నారు. మంగళగిరి నుంచి అడ్వైజర్ల బృందం గురువారం చింతపల్లిలో ఆకస్మికంగా పర్యటించింది. ఈ సందర్భంగా చింతపల్లి మండలంలోని టీడీపీ సహా కూటమి పార్టీల పరిస్థితుల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను స్థానిక కూటమి నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమిష్టిగా పని చేయాలని సూచించారు. అడ్వైజర్ల బృందం సభ్యులు లక్ష్మణ్, నగేసు, లక్ష్మి లతో పాటు స్థానిక టీడీపీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, కోరాబు గాంధీ పడాల్, టీ డీ పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడమే లక్ష్యం

విశాలాంధ్ర-హుకుంపేట : గ్రామీణ ప్రాంతాలలో పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల రూరల్ డెవలప్మెంట్ నిధులు ద్వారా హుకుంపేట పంచాయతీ లో పబ్లిక్ టాయిలెట్ నిర్మాణ పనులను గురువారం స్థానిక సర్పం చ్ సమిడ వెంకట పూర్ణిమ పరిశీ లించడం జరిగిందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయం పక్కన ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా 3. లక్షలు వ్యయంతో ఆధునిక పబ్లిక్ టాయిలెట్ నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. గ్రామస్తులు, ఆరోగ్య రక్షణ స్థానిక సచివాలయంలో ఆఫీస్ తమ పనులు నిమిత్తం వచ్చిన మహిళాలు, వృద్ధులు, విద్యార్థుల వంటి వర్గాలకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగ కరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్‌సిపి మండల అధ్యక్షులు అనిల్, సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ మనోజ్, డిజిటల్ అసిస్టెంట్ బాల మురళి కృష్ణ, హార్టి కల్చర్ అసిస్టెంట్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తేడులో ఐటిడిఎ పీఓ పర్యటన

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలో గురువారం రంపచోడవరం ఐటిడిఎ పీఓ స్మరణ్ రాజ్ పర్యటించారు. గుర్తేడు, దారగడ్డ, పాతకోట పంచాయితీ లలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూ ను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అందజేయాలన్నారు .గుర్తేడు పి హెచ్ సీ సందర్శించి వైద్యులు, సిబ్బంది వివరాల పై రికార్డులు పరిశీలించారు. రోగులకు సకాలంలో చికిత్స అందించి మందులు ఇవ్వాలన్నారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు.అలాగే గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాపన్న దొర,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

41 మంది అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేత

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలంలోని 41 మంది మిని అంగన్‌వాడీలకు మేన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తు గురువారం వారికి నియామక పత్రాలు అందజేసినట్లు సీడీపీవో బాలమణి దేవి తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్ పాల్గొని అంగన్‌వాడీలకు నియామక పత్రాలు అందజేశారు. అలాగే మండలంలోని విధులు నిర్వహిస్తున్న 257 మంది అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సూపర్ వైజర్లు కె.ఉమ, ఎల్.ఎల్.కుమారి, పైడికొండమ్మ, ఎస్.సత్యనారాయణమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ : సిడిపిఓ రేఖ వాణి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్)లో పలు మార్పులు చోటుచేసుకున్నాయని ఇందులో భాగంగా కార్య కర్తలకు నూతన సెల్ ఫోన్లు, యాప్‌లు అందుబాటులోకి రానున్నాయని సిడిపిఓ జె రేఖవాణి అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఈనెల 13వ తేదీన రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతులమీదుగా సెల్ ఫోన్ అందజేస్తారని అన్నారు. శనివారం జరిగే మంత్రి కార్యక్రమానికి ప్రతి కార్యకర్త హాజరుకావాలని, ఈ కార్యక్రమం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వన్ స్టాప్ సెంటర్ ఆవరణలో జరుగుతుందని తెలిపారు. పార్వతీపురం ప్రాజెక్టుకు సంబంధించి 172 సెల్ఫోన్ మంజూరయ్యాయి అని వివరించారు.

నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ధర్నా జయప్రదం చేయండి

ప్రాజెక్టు కార్యదర్శి సిహెచ్ అనురాధ

విశాలాంధ్ర-కొమరాడ : పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండల కేంద్రంలో అంగన్వాడి సిబ్బంది యొక్క సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడి సిబ్బందితో కలిసి ప్రాజెక్టు కార్యదర్శి అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానుద్దేశించి వారు మాట్లాడుతూ ఈరోజు అంగన్వాడి సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండే సందర్భంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఇలాంటి సందర్భంలో అంగన్వాడి సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉద్యోగ భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఇప్పటికే పెండింగ్ లో ఉన్న బిల్లులతో పాటు మినీ వర్కర్ల సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నామని అలాగే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వలస కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేక కోట్లాదిమంది ఉద్యోగులు, కార్మికులు దినదిన గండంగా జీవితం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను హరించే విధంగా నూతనంగా లేబర్ కోడ్ల ను ప్రవేశపెట్టి కార్మిక వర్గంపై తీవ్ర భారం మోపారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం ద్వారా సామాన్య ప్రజలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్ట పెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మన రాష్ట్రంలో మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ లీడర్లు అలివేలు, జ్యోతి, రాధా, రాణి, సుజాత, మాధవి, రామలక్ష్మి, సరోజినీ, వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఏ ఫారెస్ట్ ఎస్‌డిఎల్‌సి సమావేశం

విశాలాంధ్ర-సీతంపేట : ఫారెస్ట్ పరిధిలో మంజూరైన గృహాల నిర్మాణాలకు సంబంధించి ఎల్పీసీ సర్టిఫికెట్లు జారీ చేయుటలో భాగంగా 58 ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎస్ డి ఎల్ సి సమావేశాన్ని బుధవారం ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట, పాలకొండ భామిని, వీరఘట్టం మండలాలకు చెందిన 58 ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎస్ డి ఎల్ సి సమావేశంలో ఆమోదించారు. త్వరలోనే డి ఎల్ సి సమావేశం నిర్వహించి లబ్ధిదారులందరికీ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ శాఖ అధికారులు, అటవీశాఖ డీటి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారిపై కార్యకర్త పైశాచిక దాడి...?

- పిడికి ఫిర్యాదు చేసిన బాధిత చిన్నారి తాతయ్య

-క్షేత్రస్థాయి దర్యాప్తు చేసిన సూపర్వైజర్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : కేంద్రాలకు వచ్చే చిన్నారులను కంటికి రెప్పలా చూసి, సక్రమంగా పౌష్టికాహారం అందించి, వారిలో పౌష్టికాహార లోపం లేకుండా చూసి, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అంగన్వాడీ కార్యకర్తలు సహనాన్ని కోల్పోయి చివరకు మాట రాని, అభం శుభం తెలియని చిన్నారులపై పైశాచిక దాడికి దిగుతున్నారు. ఎన్నో నోములు వ్రతాలు చేసి శిశుపులకు జన్మనిస్తున్న తల్లులకు తీవ్ర కడుపుకోతను మిగులుస్తున్నారు. కేంద్రాలకు పంపిస్తే పౌష్టికాహారం అందటమే కాకుండా చిన్నారులు ప్రయోజ వంతులు అవుతారని భావిస్తున్న తల్లిదండ్రులకు తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారు. ఈ విధంగా అంగన్వాడి కేంద్రాలకు వస్తున్నా చిన్నారులపై భౌతిక దాడికి కార్యకర్తలు దిగుతూ ఉండడం విచారకరం. ఇటువంటి సంఘటనే మండలంలోని అడ్డాబు శీల పంచాయతీలో చోటు చేసుకుంది. జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారిపై భౌతిక దాడికి ఎదిగిన అంగన్వాడి కార్యకర్తపై శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులతో పాటు బాధిత చిన్నారి తల్లిదండ్రులు కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే అడ్డాపు శీల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంబి2 లో మదిలి జస్వీక విద్యార్థిని. జస్వీక ప్రీస్కూల్ విద్యార్థులు కావడంతో ఆమెకు కార్యకర్త అలివేలు ఈనెల 9 తేదీన తీవ్రంగా కొట్టడంతో చిన్నారి జస్వీక ఒంటిపై గాయాలు స్పష్టంగా చూసిన ఆమె తాతయ్య ఎం నరసింహారావు చలించిపోయారు. జరిగిన సంఘటనపై కార్యకర్తకు నిలదీసి, నేరుగా పిడికు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు పార్వతీపురం ప్రాజెక్ట్ సిడిపిఓ రేఖ వాణి జరిగిన విషయంపై క్షేత్రస్థాయి దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని సూపర్వైజర్ అమ్మరాజులకు బాధ్యతలు ఇచ్చారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సూపర్వైజర్ అమ్మ రాజులు గురువారం గ్రామంలో పర్యటించి జరిగిన సంఘటనపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. బాధిత బాలిక జస్వీక శరీరంపై గాయాలు ఉండడం, తీవ్ర జ్వరానికి లోను కావడంతో కార్యకర్త అందుబాటులో లేకపోవడం గ్రామస్తులకు ఆమె పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన జరిగిన రోజు కార్యకర్త అలివేలు, ఆమె సహాయకురాలు కలిసి అంగన్వాడి సెంటర్లో విధులు నిర్వహిస్తున్న వేళ జస్వీక తోటి చిన్నారులపై దాడి చేయడంతో అది చూసి సహించలేక సహనం కోల్పోయి కార్యకర్త అలివేలు ఆమెపై పైశాచిక దాడి నిర్వహించి భౌతికంగా గాయపరిచినట్లు కొందరు ప్రత్యేక సాక్షులు చెప్పినట్లు సమాచారం. అలాగే జస్విత తాతగారైన ఎం నరసింహారావు కూడా ఈ విషయంలో న్యాయం చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన సంగతి తెలిసిందే. గ్రామంలోని రామ్ మందిరం వీధిలో గల అంగన్వాడి బి2 కేంద్రంలో ఇటువంటి సంఘటన జరగడం చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన సూపర్వైజర్ అమ్మరాజులు వాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో ఇస్తారో...? లేక జరిగిన సంఘటనను కప్పి ఉంచుతారో తేలాల్సి ఉంది.

కలెక్టర్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర - బెలగాం : జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల్లోని ముస్తాబు కార్యక్రమం నేడు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొంది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత కూడా మన్ననలు ప్రశంసలు పొందిన సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. నాగేశ్వరరావు సారథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల సిబ్బంది కలెక్టర్ ను గౌరవపూర్వకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులందరికీ వారి స్థాయిలను బట్టి బాగా చదివించి శతశాతం ఉత్తీర్ణత కోసం విద్యార్థులను సంసిద్ధులను చేయాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగించే ఆటల పైన కూడా దృష్టి పెట్టాలని కలెక్టర్ తెలియజేశారు.

అంగన్వాడి ధర్నా జయప్రదం

ప్రాజెక్టు కార్యదర్శి సిహెచ్ అనురాధ

విశాలాంధ్ర కొమరాడ : పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండల కేంద్రంలో అంగన్వాడి సిబ్బంది యొక్క సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడి సిబ్బందితో కలిసి ప్రాజెక్టు కార్యదర్శి అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానుద్దేశించి వారు మాట్లాడుతూ ఈరోజు అంగన్వాడి సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండే సందర్భంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని ఇలాంటి సందర్భంలో అంగన్వాడి సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉద్యోగ భద్రతతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఇప్పటికే పెండింగ్ లో ఉన్న బిల్లులతో పాటు మినీ వర్కర్ల సమస్య పరిష్కారం చేయాలని కోరుతున్నామని అలాగే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వలన కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేక కోట్లాదిమంది ఉద్యోగులు, కార్మికులు దినదిన గండంగా జీవితం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను హరించే విధంగా నూతనంగా లేబర్ కోడ్ల ను ప్రవేశపెట్టి కార్మిక వర్గంపై తీవ్ర భారం మోపారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం ద్వారా సామాన్య ప్రజలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు కూడా లేకుండా చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్ట పెట్టేందుకు ప్రభుత్వ రంగాన్ని బలహీన పరుస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా నికరమైన పోరాటాలు నిర్వహించేది సిఐటియు అని అలాంటి సిఐటియు అఖిలభారత మహాసభలు మన రాష్ట్రంలో మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల జయప్రదానికి కార్మిక వర్గం, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ లీడర్లు అలివేలు, జ్యోతి, రాధా, రాణి, సుజాత, మాధవి, రామలక్ష్మి, సరోజినీ, వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు న్యాయం చేయాలి

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నేడు మహాధర్నా

విశాలాంధ్ర-పాలకొండ: ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకొందామంటే రైతులు తీవ్ర నష్టాలు చవి చూడవలసి వస్తుందని మరోపక్క మిల్లర్ల దోపిడి, దళారుల హవా,రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం శ్రీ కోటదుర్గమ్మ తల్లి వారి ఆలయం నుంచి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో పాటు మహా ధర్నా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరు అవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బిడితి అప్పలనాయుడు పిలుపునిచ్చారు,గురువారం స్థానిక విలేకరులతో రైతు సంఘం నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు,ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వావిలపల్లి రమణమూర్తి మాట్లాడుతూ ఈ మహా ధర్నా అనంతరము స్థానిక సబ్ కలెక్టర్ వారికి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా విజ్ఞప్తి పత్రం అందజేయడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు ఈ కార్యక్రమానికి పట్టణ పరిధిలో మండల పరిధిలో యావత్ రైతాంగం హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు,ఈ సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ,ధాన్యం రైతుల సమస్యను చర్చించడం జరిగింది అనిరైతుకు మిల్లర్లకు ఎటువంటి సంబంధం లేదని కేవలం ఆర్ఎస్కేల ద్వారా మాత్రమే ధాన్యం సేకరణ జరుగుతుందని ఈ విషయంపై స్థానిక సబ్ కలెక్టర్ వారి దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు ఈ అంశాలను మరియు ప్రభుత్వం రైతుకు అందిస్తున్న సంపూర్ణ మద్దతును అధికారుల సహాయాన్ని చర్చించడం జరిగింది. ధాన్యం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా నిరసన కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు ఈ సమావేశంలో రైతు నాయకులు కిమిడి రామమూర్తి నాయుడు,గొర్లి వెంకట జగన్నాథం,బి వి రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం ఎఎస్పీ, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ మనీషా వంగలరెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్ 1,2 పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, బెలగాం దత్తుపేట మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని విద్యార్థులకు శక్తి యాప్, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలు, మహిళలపై నేరాలు, గుడ్ టచ్ &బ్యాడ్ టచ్, జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఇంచార్జి, ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్ళ రమాలక్ష్మి, నిర్మల, పద్మ శక్తి టీమ్ 1,2 పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వాయిలంటీర్లు

విశాలాంధ్ర -జియ్యమ్మ వలస: మండలంలోని తాళ్లదుమ్మ పంచాయతీ పరిధిలో గల చంద్రశేఖర రాజపురంలో చిన మేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో గత వారం రోజులుగా ఎన్ ఎస్ ఎస్ శిభిరం కొనసాగుతున్న విషయం విదితమే. అయితే గురువారం కళాశాల ఎన్ ఎస్ ఎస్ డైరెక్టర్ సంజయ్ కుమార్ చావడా ఆధ్వర్యంలో వాలంటీర్లతో గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి గ్రామం లో చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేయడమే ప్రజలకు స్వచ్ఛ భారత్ యొక్క ఆవశ్యకతను గూర్చి తెలియజేయడం జరిగిందని, పరిసరాలు, పరిశుభ్రంగా ఉంటే మన యొక్క ఆరోగ్య శైలి బాగుంటుందని ఆయన అన్నారు కాగా నేటితో ఈ కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం కార్యక్రమం

విశాలాంధ్ర - కొమరాడ : బాల్య వివాహాలు అరికడదాం బాల్య వివాహాలు అరికడదామని ఉద్దేశంతో వంద రోజులు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి జి. సుగుణ కుమారి సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరు 27 నుండి వచ్చే ఏడాది మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా వంద రోజులు బాల్య వివాహాలను జరక్కుండా అడ్డుకుందాం గతంలో గ్రామాల్లో గతంలో ఇప్పటికే ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు జరుగుతున్నప్పటికీ ఇప్పటికైనా ఆడపిల్లలను కాపాడుకుందాం నా ఉద్దేశ్యంతో ప్రభుత్వాలు అధికారులు బాల్య వివాహాలపై ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ గిరిజన గ్రామాల్లో ఇప్పటికీ అవగాహన కొంచెం లేదని అంగన్వాడి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామపంచాయతీ అధికారులతో గ్రామ సర్పంచులు ఈ వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామని భవిష్యత్తులో ఇలాంటి బాల్యవివాహాలు జరగకుండా గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు జరిపితే వెంటనే సమాచారం ఇవ్వాలంటూ ఈ ఫోన్ నెంబర్లకు 1098, 181, 100, 112, 1098 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో ఎస్. రమేష్ జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ. సత్యనారాయణ, ఎం.ఎ నాయుడు, పి. శ్రీధర్, జి. తవిటి నాయుడు, ఎ. రమ్య, అంగన్వాడి సూపర్వైజర్ శారద, లక్ష్మి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర - కొమరాడ : ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి రాష్ట్రంలో ప్రతి మహిళా అధికంగా అభివృద్ధి శ్రీ సఖి నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమంలో ఈనెల తొమ్మిది తేదీ నుండి 12వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడోరోజు వెలుగు కార్యాలయంలో మండలంలోని 34 గ్రామీణ మహిళా సంఘాల సభ్యులకు జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన బి. వెంకటరమణ, వెలుగు ఎపిఎం పి. సురేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఓ ఎస్. రమేష్, ఎస్ఐ కె. నీలకంఠం ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి మహిళ ఒక ఇంటికి ఆమె ఒక శక్తిగా ఎదగాలని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు అధిక అభివృద్ధి చెందాలని సంక్షేమం పొందిన మహిళలు ఆద్యంగా అభివృద్ధి చెందాలని మంచి ఆలోచనతో ఈ సెక్షన్ లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి ఎలా చెందాలో మరికొన్ని మంచి విషయాలు ఎన్నో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన టిఓటి వెంకటరమణ, వెలుగు సిసి నాయక్ మంజు రమేష్ ఈశ్వరమ్మ శారద రామకృష్ణ అప్పలనాయుడు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గంధం అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి ముడుపుల పూజలు

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక శ్రీలక్ష్మినరసింహస్వామినీ గంధం అలంకరణ చేయడంతోగురువారంనాడు ముడుపుల పూజలకు వచ్చిన భక్తజనం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. చలిని లెక్క చేయక వేకువజామునుండే తరలివచ్చిన భక్తులతో ఆలయం సందడిగా కనిపించింది. ముడుపులపూజలకు పాతభక్తులతోపాటు కొత్తగాభక్తులు పెద్దఎత్తునపాల్గొనిముడుపులనుకట్టినట్లుఆలయప్రధానఅర్చకులుపీసపాటిశ్రీనివాసాచార్యులు,రామానుజాచార్యులు, టీటీడీ పారాయణకర్త కె.శ్రీనివాసరావులు తెలిపారు.ముడుపులు పూజలకు దూరప్రాంతాల నుండి ఎక్కువ మంది భక్తులువస్తున్నట్లు ఆలయఅర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు తెలిపారు.ఉదయంనుండి రాత్రివరకు భక్తులు ముడుపుల పూజలను నిర్వహించడంతో పాటు భక్తులుతెచ్చిన వివిధ రకాల పూలదండలు,పూలు స్వామివారికి పెద్ద ఎత్తున అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది.ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ముడుపుల పూజలకు పాతభక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కొత్త భక్తులు రాకతో అనూహ్య స్పందన వస్తుందని తోటి భక్తులు తెలిపారు. ముడుపులు పూజలకు వస్తున్న భక్తులు నిర్మలమైన మనస్సుతో పూజలుచేస్తూ27సార్లు ఆలయంచుట్టూ మంత్రాల ఉచ్చరిస్తూ ప్రదక్షిణలను పూర్తిచేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళ్తున్నారు. ఈపూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త దంపతులు చెలికాని వెంకట గోపాలకృష్ణస్వామి, భారతిలతోపాటు భక్తజనం పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలివెళ్లారు. ఈకార్యక్రమంలోప్రధానఅర్చకులతో పాటు కె.మురారి,పవణ్ కళ్యాణ్ ఆచార్యులు, విహారి, ప్రసాద్,మనోజ్, శ్రీకర్ ఆచార్యులు తదితర అర్చకులు పాల్గొని భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదిలా ఉండగా వచ్చే శ్రీవేణుగోపాలస్వామిలక్ష్మీనరసింహస్వామి ఈనెల16నుండి జనవరి 14వరకు ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, భక్తులు తప్పనిసరిగా ఈకార్యక్రమాలకు హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయప్రధానఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం పూట ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, స్వామివారిని ఊయలలో ఊరేగింపు కూడా జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర ప్రదర్శన

విశాలాంధ్ర-పాచి పెంట: పాంచాలి గ్రామంలో ఎలాంటి ఎరువులు పురుగుమందులు వాడని దేశీయ వరి రకాల క్షేత్ర ప్రదర్శన ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సిద్ధ సన్నాలు, పాలేకర్ సాంబ, ఢిల్లీ బాస్మతి వంటి రకాలను పూర్తి స్థాయి ప్రకృతి సేద్యంలో పండించడం జరిగిందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు పాలేకర్ సాంబరకంలో పంట కోత ప్రయోగం చేయగా ఎకరానికి 18 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. ఈ మూడు రకాలు దేసి వరి రకాలని వీటి దిగుబడిని ప్రస్తుత అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలతో పోల్చకూడదని తెలిపారు. ఈ దేశి వరిరకాలు లో తక్కువ గ్లూకోస్ శాతం ఉండడం వలన మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి ఆహారం అవుతుందని కొవ్వు మరియు సోడియం తక్కువగా ఉండడం వలన గుండె జబ్బులు రాకుండా నివారిస్తుందని బాలింతలకు పిల్లలకు మంచి ఆహారం అవుతుందని వాతావరణంలో జీవ వైవిధ్యం పెరిగేటట్లు చేస్తుందని, వాతావరణ మార్పులను తట్టుకొని నిలబడుతుందని తెలిపారు. మార్కెట్లో వీటి బియ్యం ధర కిలో 200 రూపాయల వరకు పలుకుతుందని కాబట్టి రైతులు తప్పనిసరిగా ఇంటి అవసరాల కోసమైనా దేశీ వరి రకాలు పండించుకోవాలని కోరారు. దేశీ రకాల ను సాగు చేసిన రైతు మరియు సిఆర్పి కర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎకరానికి నూర్పుతో కలుపుకొని 10 వేల రూపాయల లోపు మాత్రమే ఖర్చు అవుతుందని బియ్యం గా మార్చి మార్కెట్ చేయగలిగితే పెట్టుబడికి రెండింతల లాభం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు

సూరంపేటలో బియ్యం సేకరణ గొదాము ప్రారంభం

ధాన్యం నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధర అందించాలి
గోనె సంచులు, రవాణాలో లోటుపాట్లు ఉండరాదని మిల్లర్లకు ఆదేశాలు
జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - పార్వతీపురం/సీతానగరం : సీతానగరం మండలం సూరంపేటలో ఏర్పాటుచేసిన ఎఫ్.సి.ఐ బియ్యం సేకరణ గోదామును జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ధాన్యం ఆడించాక ఈ రోజు నుంచి బియ్యాన్ని గొదాములో నిల్వ ఉంచడం జరుగుతుందన్నారు. ఈ గోదాముకు 66,643 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని త్వరగా గోదాముకు అందించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులను సమన్వయం చేసుకోవాలని జేసీ మిల్లర్లకు సూచించారు. అనంతరం సీఎంఆర్ బియ్యాన్ని గోదాములోకి పంపారు. అంతకుముందు సూరంపేట రైతు సేవా కేంద్రం, చినరాయుడుపేటలోని రైస్ మిల్లులను జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో ఆడిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యతకు తగ్గట్టుగా రైతులకు మద్దతు ధరను ఇవ్వాలని, వారికి అవసరమైన గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని అన్నారు. ఆర్ఎస్కె వద్ద ఉన్న రైతులతో ముచ్చటించిన జేసీ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించు కుంటున్న సంగతిని అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకరిస్తుందని, ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా సేకరించే సమాచారంలో అవగాహన లేమితో తప్పుగా బటన్లు నొక్కవద్దని, వాస్తవ సమాచారాన్ని మాత్రమే అందించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంసీఎస్ శ్రీనివాస్, డిఎస్ఓ, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రవి, ఎంఏఓ ఎస్. అవినాష్, ఇతర మిల్లర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృధాగా సాగునీరు,మొద్దు నిద్రలో జల వనరుల శాఖ

విశాలాంధ్ర-పాలకొండ: జలమే జీవనాధారంప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టి వినియోగించుకోవాలి,నీటిని పొదుపుగా వాడాలి అన్న ప్రభుత్వ సూక్తులు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి, ఆచరణలో అమలు చేయరా? అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు ప్రశ్నించారుగురువారంస్థానికవిలేకరులతోమాట్లాడుతూఅడ్డుకట్టవేయ లేని జలవనరు శాఖతోటపల్లి పాత రెగ్యులేటర్ షట్టరు మరామ్మతుకు గురై రెండు సంవత్సరాలు అవుతున్నా నేటి వరకు దానికి అడ్డుకట్ట వేయలేదని ఇది జలవనరుల శాఖ నిర్లక్ష్యమా? లేక మొద్దునిద్ర పోతున్నారాఅని అభ్యుదయ రైతు,వాటర్ రిసోర్స్ పర్సన్ ప్రసాదరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రధాన ఎడమ కాలువ నుంచి వృధాగా సాగునీరు పోతోంది.నీటిని పొదుపుగా వాడాలని లేకపోతే రానున్న కాలంలో జలయుద్ధాలు జరుగుతాయని ఒక పక్క నిపుణులు హెచ్చరించినా పాలకులు జలవనరుల శాఖ పట్టించుఉకోకపోవడం దుర్మార్గ మైన చర్య.అధికారులు, సాగునీటి సంఘాలు శిలా ప్రతిమిలా చూస్తున్నారు. 2008లో ఎడమ ప్రధాన కాలువకు సాగునీరు సరఫరా చేసేందుకు షట్టరు ఏర్పటు చేశారు.నేటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా సాగునీరు విడుదల సమయంలో పాలకొండ, శివారు ప్రాంతానికి సాగునీరందక లక్షలాది రూపాయల పంటలను రైతులు నష్టపోతున్నారు. షట్టరు మరమ్మతులకు గురి కావడంతో పాలకొండ ప్రాంతం రైతులకు సాగునీరు గగనంగా మారింది.దీంతో వృథాగా రోజుకు ఒక క్యూసెక్కు నీరు వృథాగా పోతుంది.ఈ నీరు నిలువ చేసి ఉండే పాలకొండ ప్రాంత రైతులకు రబీకి ఆరుతడి పంటలుగా ఉపయోగపడుతుంది.గత ఖరీఫ్ ముందు పాలకొండ సబ్ కలెక్టర్,డివిన్ జలవనరుల శాఖతో రైతు సంఘాలు సమావేశం ఏర్పరచి, కనీసం డిస్ట్రిబ్యూటరీ లకు షట్టర్లు ఏర్పాటు చేయామని, ఆగస్టు నుంచి నవంబరు వరకు సిజన్ లస్కర్లను నియమించాలని అధికారులతో చర్చలు జరిపినా చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా మారింది. షట్టర్ల మరమ్మతులకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని మూడేళ్లగా ప్రయత్నాలు చేస్తున్నామని ప్రయోజనం లేదని వీరఘట్టం జలవనరుల శాఖ ఏఈ డీవీ రహన అనడం సిగ్గుచేటు ఎన్నికల ముందు పాదయాత్రలో చంద్రబాబునాయుడు తోటపల్లి వద్ద సమావేశంలో తాము అధికారంలోకి వస్తే ఆధునీకరణ పూర్తి చేసి రైతులకు సకాలంలో సాగునీరందిస్తామని తెలిపారు.దీనికి స్పందించి తోటపల్లికి నిధులు విడుదల చేసి తమ మాట నిలబెట్టుకోమని రైతులు కోరుతున్నారు.

విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని కలిగించాలి

విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు పంపిణీ
జిల్లా రెవిన్యూ అధికారి హేమలత

విశాలాంధ్ర - బెలగాం : విభిన్న ప్రతిభావంతులలో దాగి ఉన్న కళలను, ఆటలు, క్రీడలను వెలికితీసి వారిలో ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని నింపాలని జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సందర్భంగా జిల్లాస్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ ముఖ్య అతిధిగా పాల్గొని స్కూటర్ ర్యాలీ, రన్నింగ్, వాకింగ్ వంటి పలు పోటీలకు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విజేతలకు గిరిమిత్ర హాలులో బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, వీల్ చైర్స్, అంధులకు చేతి కర్రలు, కళ్ళజోళ్ళు, శ్రవణ పరికరాలు వంటివి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో మనందరం సేవ చేయాలని, ప్రభుత్వం కూడా దివ్యాంగుల పట్ల చిత్తశుద్ధితో అనేక సంక్షేమ పథకాలతో పాటు ఆరు వేల పింఛన్ ను అందిస్తుందని గుర్తుచేశారు. స్కూటర్ రేస్ లో ప్రథమ స్థానంలో ఎం.ప్రసాద్(ఓహెచ్), ద్వితీయ స్థానంలో కె. రమేష్, వాకింగ్ (ఓహెచ్ - మహిళ)లో ప్రథమ స్థానం ఎం. రమణి, ద్వితీయ స్థానం పి. లక్ష్మి కైవసం చేసుకోగా డిఆర్ఓ బహుమతులను పంపిణీ చేశారు. అలాగే రన్నింగ్ (ఓహెచ్ - స్టిక్స్ మహిళ) లో ప్రథమ స్థానం కె.గౌరమ్మ, ద్వితీయ కె. రాములమ్మ,(ఓహెచ్ - స్టిక్స్ పురుషులు) లో ప్రథమ ఎం. సంతోష్, ద్వితీయ ఎ. శివ, సింగింగ్ మెన్స్ లో ప్రథమ స్థానం ఎం. దువ్వ నాయుడు, ద్వితీయ స్థానం ఎన్. విఠలేశ్వర రావు, మహిళల్లో ప్రథమ ఎం. మంగ, ద్వితీయ దమయంతి రాగా వారందరికీ ఆమె బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంధులైన ఎం. వెంకటేశ్వరరావు, జి. అభిరామ్ లకు డిఆర్ఓ బ్లైండ్ స్టిక్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్నప్రతిభవంతుల శాఖ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా కోఆప్షన్ మెంబర్ ఎన్నిక

విశాలాంధ్ర - గరుగుబిల్లి : మండల పరిషత్ అభివృద్ధి కార్యాల యంలో గురువారం ఎన్నికల అధి కారి పి రామచంద్రరావు కోఆప్షన్ మెంబర్ ఎన్నికను నిర్వహించారు. ఈమేరకు మండల పరిషత్తు కో ఆప్షన్ మెంబర్ కు మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు, మర్రాపు పురుషోత్తంనాయుడు, మరడాన తవిటినాయుడు, అంబటి తవిటినాయుడు (రాంబాబు), ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తి బాబు),ముదిలిబాబు విజయవాంకు సం,పొట్నూరు వెంకటనాయుడు, మరడాన సింహాచలమునాయుడు, బొంతాడ మహేశ్వరరావు(మహేష్), తదితరులతో కలిసి షేక్ యాసిన్ నామినేషన్ దాఖలు చేశారు మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ గా షేక్ యాసిన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి రామచంద్రరావు ప్రకటిం చారు. కో ఆప్షన్ మెంబెర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ యాసిన్ కు ధృవీకరణ పత్రమును ఎన్నికల అధి కారి రామచంద్రరావు అందజేశారు. కోఆప్షన్ మెంబర్ ఎన్నికను పార్వతీపురం జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పరిశీలించారు.అదే విధముగా మండల పరిషత్తు కోఆప్షన్ నెంబర్ ఎన్నికకు కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి హాజరయ్యారు.ఈ ఎన్ని కలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజం మన అందరి కర్తవ్యం

విశాలాంధ్ర-పాలకొండ: ఆంధ్రప్రదేశ్ ని మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మన అందరి కర్తవ్యం అని స్థానిక శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి పేర్కొన్నారు గురువారం పాలకొండ పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి నాగ వంశపు వీధి కూడలి వరకు అభ్యుదయం సైకిల్ యాత్రను ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణ ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం మన అందరము లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు అ అన్నారు ఏ ప్రాంతంలోనైనా మాదక ద్రవ్యాలు గంజాయి నిషేధింపబడిన ద్రవ్యాలు తెలిసినట్లయితే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ డిఎస్పి ఎం రాంబాబు సిఐ ఏ ప్రసాదరావు చినమేరంగి సీఐ తిరుపతిరావు ఎస్సైలు ప్రయోగమూర్తి కళాధర్ కూటమి నాయకులు గంటా సంతోష్ కుమార్ గర్భాన సత్తిబాబు అప్పలనాయుడు వెన్నపు శ్రీనివాసరావు సాయికుమార్ యోగ మాస్టర్ జనార్దన్ రావు పోలీస్ శాఖ అధికారులు సిబ్బంది కళాశాలల ఆధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

15న ఐటిడిఏ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



విశాలాంధ్ర- సీతంపేట: ఐటిడిఏ పరిధిలో గల ఆశ్రమ పాఠశాఈనెలలలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పవర్ సిప్నల్ జగన్నాథ్ రాత్రి 11 గంటల సమయంలో హాస్టల్ విజిట్ చేసి ఉపాధ్యాయులు ఆ సమయంలో లేరని వారికి మెమోలు జారీ చేయడం అన్యాయం అని యుటిఎఫ్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళి మోహనరావు ఖండించారు. ఈ సంఘటనకు సంబంధించి ఈనెల 15వ తారీఖున ఐటీడీఏ ఎదురుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని పత్రిక ప్రకటన ద్వారా గురువారం తెలిపారు. రాత్రి బస చేసే ఉపాధ్యాయులు రాత్రి-9 గంటలకు, రాత్రి 12 గంటలకు, ఉదయం 6 గంటలకు, ఫోటోలు అప్లోడ్ చేయాలని పివో ఆదేశించడం పట్ల యుటిఎఫ్ నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు,టి రమేష్, కె భాస్కర్, జిల్లా కార్యదర్శి లు, ఏ భాస్కరరావు,కే. కృష్ణారావు, తెలిపారు.

యోగ గురూజీ ఉపాధ్యాయుడు జనార్ధన మాస్టారుకు ఘన సత్కారం



విశాలాంధ్ర -పాలకొండ: పట్టణానికి చెందిన యోగ గురూజీ ఉపాధ్యాయుడు జనార్ధన్ మాస్టారుకు గురువారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఘనంగా సత్కరించారు అభ్యుదయం సైకిల్ యాత్ర సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి కార్యక్రమంలో వ్యాఖ్యాతగా వ్యవహరించిన జనార్ధన్ మాస్టారు సేవలు మరువలేనివని ఎంతోమంది కి యోగ ఆసనాలను నేర్పుతూ అభ్యసిస్తూ సమాజానికి పాటుపడుతున్నారని వెల్లడించారు ఈ సందర్భంగా వారితోపాటు డిఎస్పి ఎం రాంబాబు సిఐ ఏ ప్రసాదరావు ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అదించాలి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గరుగుబిల్లి : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పార్వతీ పురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును గురువారం జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్య సహాయం నిమిత్తం వచ్చే వారికి,అదే విధంగా వార్డుల్లో అందుతున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మందులు నిల్వలు పూర్తి స్థాయిలో ఉండేలా తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది తగు చర్య లు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈపరిశీలనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి,వైద్య సిబ్బంది ఎన్ జగదీశ్వరి, చింతాడ ఉదయకుమారి,బురిడి ఫకీరునాయుడు,పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర -సీతానగరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీతానగరం మండల శాఖ కౌన్సిల్ సమావేశం స్థానిక సీతానగరం ప్రాథమిక పాఠశాలలో జరిగినది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు శ్రీమతి కె. విజయగౌరి మరియు ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి నీరస శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన శ్రీమతి కె విజయగౌరి ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వ నిర్లిప్తత ధోరణిని దుయ్యబట్టారు. పరిశీలకులుగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని అన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రక్రియలో మండల నూతన కార్యవర్గాన్ని ఉపాధ్యాయులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షులుగా తీల మధుసూదన రావు అధ్యక్షులుగా మర్రాపు గోవిందరావు సహాధ్యక్షులుగా బూరాడ ఆదినారాయణ మహిళా సహాధ్యక్షురాలిగా కూనలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా బొత్స ప్రసాదరావు కోశాధికారిగా డోకల వెంకటరమణ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పల్లె శ్రీనివాసరావు, కింతలి ఉమామహేశ్వరరావు, తెర్లి అప్పలనాయుడు మరియు మండల కౌన్సిల్ సభ్యులుగా గొర్లి పోలినాయుడు, కునుకు మురళి, ఆది వెన్నెల శంకరరావు, వెన్నెల తవిటి నాయుడు, జాగాన సింహాచలం, నాగులకొండ త్రినాథ్, బలగ ప్రసాద్, కే కృష్ణ దాస్, రాయల శంకరరావు, కర్రి వెంకటరమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గం చే పరిశీలకులు ప్రమాణ స్వీకార ప్రతిజ్ఞ చేయించారు.